క్లుప్తంగా

ఈవీఎంల పరిశీలన

చైతన్యపురి: తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ్ ఆధ్వర్యంలో ఈవీఎంల కమిషనింగ్ నిర్వహించారు. జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ సథురప్పన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ రవీందర్‌కుమార్, ఏఆర్‌ఓలు అరుణ కుమారి, దశరథ్ ఎంఆర్‌ఓ సునీత, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన హోం ఓటింగ్

లింగోజిగూడ: పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేయలేని 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, వికలాంగులకు నిర్వహించిన ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ (హోం ఓటింగ్) గురువారంతో ముగిసింది. 80 వయస్సు దాటిన వృద్ధులు 388, దివ్యాంగులు 33 మంది ముందస్తుగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా, ఇందులో 373 మంది వయోవృద్ధులు, 33 మంది దివ్యాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎన్నికల బందోబస్తులో భాగంగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా 631కి గాను 491మంది వినియోగించుకున్నారు. ఎన్నికల శిక్షణ కోసం వచ్చిన 199 మంది సిబ్బంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

హనుమాన్ ఆలయంలో అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న లతాశ్రీ, శ్రీశైలంగౌడ్ దంపతులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో గురువారం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా గిరీష్ నాయర్ గురుస్వామి హాజరయ్యారు. భక్తులకు కౌన్సిలర్ లతాశ్రీ, శ్రీశైలంగౌడ్ దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, పినబాక ప్రభాకర్, బాల్‌రెడ్డి, రాజు, శంకర్, శివ, శేఖరప్ప, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

షాద్‌నగర్: సత్యసాయి జయంతి వేడుకలను గురువారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పరిగి రోడ్డులోని సత్యసాయి సేవా మందిరంలో సేవా సమితి కన్వీనర్ వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. తెల్లవారు జామున సుప్రభాతం, మహానగర సంకీర్తన, అన్నదానం చేశారు. పట్టణంలోని జియాన్ పాఠశాలలో సేవాదళ్ సభ్యులు విద్యార్థులకు శ్లోకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సాయంత్రం భజన, ఊయల సేవ, మహామంగళహారతి కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మొయినాబాద్‌రూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని రాష్ట్ర పీఆర్టీయూ అధ్యక్షుడు చెన్నయ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అనంతరెడ్డి అధ్యక్షతన స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులకు తొలి మెట్టు పాఠశాల అని చెప్పారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి



మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు

గెలిపించండి.. సేవకుడిగా ఉంటా

- బీఆర్‌ఎస్‌కు అధికారం ఇవ్వొద్దు
- సర్వేలన్నీ మాకే అనుకూలం
- ఇందిరమ్మ రాజ్యం వస్తేనే పేదలకు మేలు
- గ్యారంటీలతోనే ప్రగతి
- కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: 'ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపించండి. మీకు 'సేవకుడిగా పనిచేస్తాను' అని కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. దేశంలోని ప్రముఖ సర్వేలన్నీ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పేర్కొంటున్నాయని తెలిపారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ, గునుగల్ గ్రామాల్లో గురువారం సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కొందని, మరోసారి అవకాశమిస్తే మిగిలిన భూములను కూడా గుంజుకుంటారని తెలిపారు. ఎట్టి పరిస్థితిల్లో బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇవ్వొద్దని కోరారు. ఎకరాకు ఏడాదికి రూ.10వేల రైతుబంధు ఇచ్చి వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, యంత్రాలపై రాయితీలు ఎత్తేసి రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే రైతుల ఆత్మహత్యలు పెరిగినట్లు సర్వేల్లో తెలిందని గుర్తుచేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కూడా రూ.కోట్లు విలువ చేసే భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే పేదలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అసైన్డ్ భూములను తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి.. పేదల జీవితాల్లో మార్పు తెస్తామని తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

ప్రతి బూత్‌లో అత్యధిక మెజార్టీ సాధించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని రంగారెడ్డి సూచించారు. గడ్డమల్లయ్యగూడ, గునుగల్ గ్రామాల్లో ప్రచారం ముగిసిన అనంతరం గునుగల్ గ్రామంలో పార్టీ శ్రేణులతో ప్రచారం నిర్వాహణపై సమీక్ష నిర్వహించారు. బూత్ ఇన్‌చార్జిలు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గడ్డమల్లయ్యగూడ సర్పంచ్ జంగయ్య, మాజీ సర్పంచ్ గుండ్లపల్లి సురేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని ఆ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం రాత్రి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడ, ఖానాపూర్ గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతి ప్రజాప్రతినిధుల భరతం పడుతామని హెచ్చరించారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డు, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎంతమందికి ఇచ్చిందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో వందలాది ఎకరాల భూమిని అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు.

రంగారెడ్డిని గెలిపించండి

మంచాల: రంగారెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ యువజన విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సతీశ్ కోరారు. గురువారం మంచాల మండలంలోని జాపాల గ్రామంలో ఇంటింటికీ ప్రచారం చేశారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగాలంటే కచ్చితంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లోకి ధన్‌రాజ్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు ఆకుల ధన్‌రాజ్‌గౌడ్ గురువారం తన అనుచరులతో కలిసి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కాగా గత ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రెబల్ అభ్యర్థిగా ధన్‌రాజ్‌గౌడ్ పోటీ చేశారు.

నాలుగోసారి ఆశీర్వదించండి

- విజ్ఞతతో ఓటేయాలి
- అత్యధిక మెజార్టీతో గెలిపించండి
- పట్నాన్ని ఎంతో అభివృద్ధి చేశా
- అవినీతికి పాల్పడాల్సిన అవసరం లేదు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నాలుగోసారి ఆదరించి గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అభ్యర్థించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్, ఇబ్రహీంపట్నం, శేరిగూడ, సీతారాంపేట గ్రామాల్లో కిషన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పట్నం మున్సిపాలిటీలో తాగేందుకు మంచినీళ్లు, సదుపాయాలు లేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తన హయాంలో రూ.40కోట్లతో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటి అందిస్తున్నామని, అంతర్గత రోడ్ల నిర్మాణం, 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో నిషేధం ఉండడంతో సొంత జాగ, ఇంటి కల నేరవేరలేదన్నారు. ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంతో సొంతింటి కలను సాకారం చేయబోతున్నామని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళిత, బీసీ, మైనార్టీబంధు తదితర పథకాల తో అర్హులను ఆదుకోనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే వంట గ్యాస్ సిలిండర్ రూ.400లకే ఇస్తామని తెలిపారు.

అవసరమైతే భూమి అమ్ముకుంటా

'ఆ భగవంతుడు నా తండ్రికిచ్చిన ఆస్తి ఉంది. అవసరమైతే నా ఖర్చులకు రెండు మూడు ఎకరాల భూమిని అమ్ముకుంటానే తప్పా.. అవినీతికి పాల్పడను' అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో విజ్ఞతతో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి, కౌన్సిలర్లు నీలం శ్వేత, యాచారం సుజాత, మంద సుధాకర్, నల్లబోలు మమతతోపాటు పార్టీ నాయకులు అల్వాల వెంకట్‌రెడ్డి, యాచారం రవీందర్, తాళ్ల మహేశ్‌గౌడ్, కేవీ రమేశ్‌రాజు, రాజు, కంచకట్ల భాస్కర్, వేణుగోపాల్‌రావు, ఖాజా పాల్గొన్నారు.

మంచిరెడ్డి గెలుపు ఖాయం

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రమేశ్‌గౌడ్, పాశ్ఛ భాషలు ధీమావ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కిషన్‌రెడ్డి గెలిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. రూ. వేలాది కోట్ల నిధులతో అన్ని గ్రామాలను అభివృద్ధి చేశారని తెలిపారు. మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కిషన్‌రెడ్డి మంత్రి అవుతాడని పేర్కొన్నారు.



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఒక్క అవకాశం ఇవ్వండి

- అభివృద్ధి చేసి చూపిస్తా
- కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి

కడ్తాల్: ప్రజా సమస్యలపై 40 ఏళ్లుగా అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశానని, నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించి గెలిపించాలని కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆచారి కోరారు. ఎమ్మెల్యేగా ఒక్క అవకాశమిస్తే, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంతో పాటు, పెద్దారెడ్డి చెరువుతండాలో బళ్లారి ఎమ్మెల్యే కృష్ణనాయక్, జాతీయ బీసీ కమిషన్ మాజీ ఉపాధ్యక్షుడు లోకేశ్ ప్రజాపతి, బీజేపీ ఉపాధ్యక్షుడు నందీశ్వర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా రైతులు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టి పాలన సాగిస్తోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి శంకర్ నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యానాయక్, నాయకులు డాక్టర్ రమేశ్, మోహన్‌రెడ్డి, వీరయ్య, రాందాస్‌నాయక్ ఉన్నారు.



ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఆచారి

ఊరూరా జనజాతర

- జెండాలు, ఎజెండాలు వేరు
- జనం మాత్రం వారే
- అంతుచిక్కని ఓటరు నాడి తలపట్టుకుంటున్న అభ్యర్థులు



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ తేదీ సమీపిస్తున్న తరుణంలో ఊరువాడ ప్రచారం హోరెత్తుతోంది. ఇంటింటి ప్రచారంలో పాటు ప్రధాన నాయకుల రోడ్ షోలు, బహిరంగ సభలతో ఒక్క నిమిషం ఖాళీ లేకుండా బిజీ షెడ్యూల్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు. అయితే అన్ని పార్టీలు ప్రజలను ప్రచార అస్త్రాలుగా వాడుకుంటున్నారు. ఏ పార్టీ అయినా బలంగా ఉందంటే.. దానికి కారణం జనమే. అభ్యర్థుల గెలుపోటముల్లో వీరిదే కీలక పాత్ర. వీరిని ఓటర్లగానే కాకుండా ప్రచారానికి కూడా వాడుకుంటున్నారు.

రసవత్తరంగా 'పట్నం' రాజకీయం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచి రాత్రి పదిగంటల వరకు ప్రచారం సాగిస్తున్నారు. అయితే ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లుగా తలపడుతున్నారు. ప్రచారంలో బీజేపీ కాస్త నెమ్మదిగా ఉన్నా.. ఆ పార్టీ బలంగా ఉన్న గ్రామాల్లో జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లిన కనీసం 1,000 మందికి తగ్గకుండా ప్రజలు ప్రచారంలో ఉండేలా అన్ని పార్టీలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులను కూడా ప్రచారంలో వాడుకుంటున్నాయి.

గందరగోళంలో అభ్యర్థులు

నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంతో పాటు పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల్లో పార్టీలతో సంబంధం లేకుండా అన్ని పార్టీల ప్రచార కార్యక్రమాల్లో విరివిగా ప్రజలు పాల్గొంటున్నారు. పూటకు రూ.200 నుంచి రూ.500 వరకు చెల్లిస్తున్నారు. ఉదయం ఓ పార్టీ తరపున ప్రచారం చేస్తే సాయంత్రం మరో పార్టీ జెండా మోస్తున్నారు. గ్రామాలకు వెళ్లే నేతలకు కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రచారంలో భాగంగా ఏ పార్టీ నాయకులు సభలు, సమావేశాలు ఏర్పాటుచేసినా వేలాదిగా జనం తరలివెళుతున్నారు. దీంతో ఆయా పార్టీల నేతలు ఓటరు నాడి పసిగట్టలేక పోతున్నారు. దీంతో ఓటరు తీర్పు ఎలా ఉంటుందోనని అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. పార్టీల సంగతి ఏమో కానీ.. ప్రచారంలో పాల్గొన్న జనం మాత్రం ఫుల్ ఖుషీగా ఉన్నారు.

విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ దూకుడు

- 'హస్తం'తోనే అన్ని వర్గాలకు మేలు
- ఆ పార్టీ మహేశ్వరం అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- ఆరు గ్యారెంటీలతో ప్రచార పర్వం
- బ్రహ్మరథం పడుతున్న ప్రజలు



మహేశ్వరంలో ప్రచారం చేస్తున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తన దైన శైలిలో నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపై నడిపిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లలతో విస్తృతంగా తిరుగుతూ తుక్కుగూడ సభలో సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రైతులకు ఎకరానికి రూ.15 వేల పంట పెట్టుబడి సాయం, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం, మహిళలకు రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, ఉన్నత చదువులకు విద్యార్థులకు రూ.5 లక్షల సహాయం, గృహజ్యోతి పథకం ద్వారా మహిళలకు రూ.2,500 చెల్లింపు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తామని కేఎల్లార్ హామీ ఇస్తున్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ముందంజలో దూసుకుపోతుంది. తక్కువ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ వారిని చైతన్య పరుస్తున్నారు. గతంలో కేఎల్లార్ చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు, లీడ్ ఇండియా ద్వారా చేసిన పనులను యువతకు తెలియజేస్తూ ముందుకెళ్తున్నారు. ప్రచారంలో చలోక్తులు విసురుతూ అందరితో కలివిడిగా మాట్లాడి ఓటర్లను ఆకర్షిస్తున్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ గెలవడంతో పాటు రాష్ట్రంలో వచ్చేది తమ ప్రభుత్వమే అని ప్రచారం చేస్తున్నారు.

నారాయణరెడ్డిని గెలిపించండి

- కసిరెడ్డి మాధవి

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, హస్తం గుర్తుకు ఓటు వేసి కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి మాధవి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పథకాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భ్రమలు కల్పించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకమై కేసీఆర్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. కల్వకుంట్ల కుటుంబం చేతిలో రాష్ట్రం బందీ అయిందని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాయ మాటలు చెప్పి మరోసారి అధికారంలోకి రావాలని భావిస్తున్న బీఆర్‌ఎస్‌కు భంగపాటు తప్పదని హెచ్చరించారు. నారాయణరెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మాధవి తదితరులు

ఇంటింటి ప్రచారం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో గురువారం నారాయణరెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. నారాయణరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మానయ్య, కేశవులు, జంగయ్య, కృష్ణనాయక్, అబ్దుల్‌ఖాదర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను జయప్రద్రం చేయండి

కాంగ్రెస్ నేత చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈ నెల 25న కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపే లక్ష్యంగా నిర్వహిస్తున్న బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సభ ఏర్పాట్లను గురువారం ఏఐసీసీ కార్యదర్శి సందీప్, కాంగ్రెస్ పరిశీలకుడు మునీల్, కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, వంశీచంద్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ గెలుపు కోసం మల్లికార్జున్‌ఖర్గే, ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తారని తెలిపారు. సభకు అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

కేసీఆర్‌పై తీవ్ర వ్యతిరేకత

రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ నియంత పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఏఐసీసీ కార్యదర్శి సందీప్ అన్నారు. కర్నాటక రాష్ట్రంలో ఎన్నికల సమయంలో అప్పటి బీజేపీ ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత కనిపించిందని అదేవిధంగా తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వంపై అంతకంటే ఎక్కువగా వ్యతిరేకత కనిపిస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసి తీరుతామని ఆయన చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, బిచ్చానాయక్, శ్రీనివాస్‌రెడి పాల్గొన్నారు.